మల్టీజోన్-1లో 13మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

ఖిల్లా, జూన్ 11: మల్టీజోన్-1 పరిధిలో పనిచేస్తున్న 13మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ మంగళశారం ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ ముగియడంతో పోలీసు శాఖలో పెద్దఎత్తున బదిలీల ప్రక్రియ మొదలైంది. ఈ క్రమంలోనే తాజాగా సీఐల బదిలీలు జరిగాయి. త్వరలో మరికొంత మందిని సైతం బదిలీ చేసే అవకాశం ఉంది. ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఎం.రమేష్‌ను సీసీఎస్-1నిజామాబాద్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. నిజామాబాద్ వీఆర్ అటాచ్ ఐజీ కంట్రోల్‌రూమ్‌లో పనిచేస్తున్న బత్తుల సత్యనారాయణను కొత్తగూడెం జిల్లా ఎల్లందు ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు.



బడికి వేళాయె

నేడే పాఠశాలల పునఃప్రారంభం



- సమస్యల వలయంలో ప్రభుత్వ బడులు
- కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం
- పూర్తి కాని మన ఊరు-మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- జిల్లాలో 1221 ప్రభుత్వ, 496 ప్రైవేట్ పాఠశాలలు

నిజామాబాద్ అర్బన్, జూన్ 11: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు బుధవారం నుంచి పునఃప్రారంభంకానున్నాయి. జూన్ 12 నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభంకానుండడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త తరగతులకు, కొత్తగా పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు ఉత్సాహంగా స్కూళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఉత్సాహంగా వెళ్తుండగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రం సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1221 ప్రభుత్వ పాఠశాలలు సమస్యతో విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి. చాలా వరకు పాఠశాలలు మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి ఇంకా పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవు. మన ఊరు మన బడి కింద ఈ కార్యక్రమాలను చేపడుతున్న ఇంకా పనులు పూర్తికాలేదు. మన ఊరు మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల ప్రగతి మారుతుందని ఆశించినప్పటికి జిల్లాలో పనులు మాత్రం అంతవేగంగా జరగడంలేదు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మన ఊరు మన బడి పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. నిధుల కొరతతో పనులు నిలిచిపోయాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద జిల్లాలో 793 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం పనులు చేపడుతుండగా ఇప్పటి వరకు 484 పాఠశాలల్లో పనులు పూర్తవగా మిగిలిన పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి.

జిల్లాలో 1221ప్రభుత్వ,496 ప్రైవేట్ పాఠశాలలు

జిల్లాలో 1221 ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పాఠశాలలు ఉండగా 496 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. గత విద్యాసంవత్సరం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 2లక్షల 91వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో ఎంపీపీ, జడ్పీపీపీ స్కూళ్లు 673 ఉండగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 112, ప్రభుత్వ పాఠశాలలు (డీఎన్‌టీ) 04, కేజీబీవీలు 25, 110 ప్రాథమికోన్నత పాఠశాలలు, 230 ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లు 10, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు 01, ప్రైవేట్ ఏయిడెడ్ పాఠశాలలు 31, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు 465, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు 3, మిని గురుకులం 1, మైనార్టీ వెల్ఫేర్ పాఠశాలలు 17, మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలు 13, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ సీబీఎస్‌ఈ పాఠశాలలు 6, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ డెఫ్ అండ్ డమ్ పాఠశాల 1, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు 9, రెసిడెన్షియల్ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు 2, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల 1, ఆశ్రమ పాఠశాలలు 3, కేంద్రీకయ విద్యాలయాలు 2, మొత్తం జిల్లావ్యాప్తంగా 1717 పాఠశాలల్లో 2లక్షల 91వేల 261 మంది విద్యార్థులు గత విద్యాసంవత్సరం చదివారు. ఇందులో బాలురు లక్ష 49వేల 395 మందికాగా బాలికలు లక్ష 41వేల 866 మంది ఉన్నారు. ఇందులో లక్ష 63వేల 81 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతుండగా లక్ష 28వేల 785 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు.

సమస్యల నిలయంలో ప్రభుత్వ పాఠశాలలు

జిల్లా వ్యాప్తంగా అన్ని మేనేజ్‌మెంట్‌లలో కలిపి ప్రభుత్వ పాఠశాలలు 1221 ఉండగా చాలా వరకు పాఠశాలలు సమస్యల నిలయంగా ఉన్నాయి. మన ఊరు మన బడికింద చేపడుతున్న పనులు పూర్తిస్థాయిలో పూర్తికాకపోవడంతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు కూడా ఇంకా కొనసాగుతున్నాయి. అలాగే విద్యా సంవత్సరం ప్రారంభంరోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు 90 శాతానికి పైగా పాఠ్యపుస్తకాలు వచ్చాయి. పాఠశాల ప్రారంభం రోజే పాఠ్యపుస్తకాలను అందించనున్నారు. యూనిఫాంలు కూడా 90వేలకు పైగా కుట్టడం పూర్తయింది. జిల్లాలో 848 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత విద్యాసంవత్సరం నుంచి విద్యావలంటీర్ల నియామకం లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది. కాగా, బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు స్పదందించి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రైవేటుకు దీటుగా బోర్గాం (పి) పాఠశాల

- రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచిన పాఠశాల
- పాఠశాలను వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

మోపాల్, జూన్ 11: నగర శివారులోని బోర్గాం(పి) జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు విద్యాబోధనను అందిస్తున్నారు. రాష్ట్రంలోనే ఈ పాఠశాల ఐదో స్థానంలో నిలిచింది. నగర వాసులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడారంగాల్లో కూడా వివిధ బహుమతులను సాధించారు. ఈ పాఠశాలలో పాఠశాలలో 6వ తరగతిలో 132, 7వ తరగతిలో 170, 8వ తరగతిలో 204, 9వ తరగతిలో 195, 10వ తరగతిలో 240 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మొత్తం ఈ పాఠశాలలో 941 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యార్థుల కు మొత్తం ఉపాధ్యాయులు 45 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 24 మంది ఉపాధ్యాయులు మాత్రమే రెగ్యులర్‌గా ఉండగా, పది మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వచ్చి విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నారు. మరో పది మంది ఉపాధ్యాయుల కొరత ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని అందులో చదువుకుంటున్న విద్యార్థులు వాపోతున్నారు. నిజామాబాద్ నగరానికి ఇంత దగ్గరలో ఉన్న ఈ పాఠశాలకే ఉపాధ్యాయుల కొరత ఉంటే మారుమూల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల పరిస్థితి ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ పాఠశాలలో చదువుకుంటున్న 10వ తరగతిలో 90 శాతం మంది విద్యార్థులు పాస్ కాగా, ఇందులో ఒకరు 10-10 శాతం రాగా, 98లో ముగ్గురు, 95 శాతంతో ముగ్గురు విద్యార్థులు పాస్ కాగా మిగతా విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు.

14 వరకు ఐటీఐలలో అడ్మిషన్ల గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్, జూన్ 11: తెలంగాణ ప్రభుత్వ ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో (ఐటీఐ)లో ఉచితంగా అడ్మిషన్లు పొంది వివిధ పారిశ్రామిక కోర్సుల్లో శిక్షణ పొందేందుకు 2024 సంవత్సరానికి గాను అడ్మిషన్ల గడువు తేదీని ఈనెల 14 వరకు పొడగించినట్లు జిల్లా కన్వీనర్ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 5 ప్రభుత్వ ఐటీఐలలో 1028 సీట్లు, 3 ప్రైవేటు ఐటీఐలలో 488 సీట్లు ఉన్నాయని 14 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు ఈనెల 10లోగా ఐటీఐ.తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మొదట రిజిస్ట్రేషన్ చేసుకొని వెబ్ ఆప్షన్లు పెట్టి ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. మెరిట్ రూల్ ఆఫ్ రిజర్వేషన్, మరియు వెబ్ ఆప్షన్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ ఎస్సెస్సీ మెమో ప్రకారం పేరు, పుట్టిన తేదీ ఆధార్‌కార్డులో ఉండేలా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9948195654, 9490057403 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



త్వరలో విద్యుత్ శాఖలో బదిలీలు!

- బదిలీల జాబితాను సిద్ధం చేస్తున్న ఉన్నతాధికారులు
- ఈ నెల 15న తర్వాత గైడ్‌లైన్స్ వచ్చే అవకాశం

సుభాష్‌నగర్, జూన్ 11: టీజీఎన్‌పీడీసీఎల్ జిల్లా పరిధిలో బదిలీలో త్వరలో జరగనున్నాయి. విద్యుత్ శాఖలో బదిలీల కోసం ఉన్నతాధికారులు జాబితాను సిద్ధం చేశారు. వరంగల్ సీఎండీ కోరిన నివేదికను ఇప్పటికే అందజేసినట్లు సమాచారం. జేఎల్ఎం నుంచి మొదలు కొని ఏఈ, ఏడీఈల వరకు బదిలీలు జరగనున్నాయి. బదిలీల్లో ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారిని జాబితాలో చేర్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రెండు సంవత్సరాలుగా బదిలీలు లేకపోవడంతో యాభైశాతం ఉద్యోగులను బదిలీ చేయకపోవడంతో ఐదు సంవత్సరాలుగా ఒకేచోట పనిచేస్తున్నారు. ఐదు సంవత్సరాలుగా పనిచేస్తున్న కొందరు ఉద్యోగులపై అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉండడంతో బదిలీలను వీరిని మొదటి జాబితాలో చేర్చనున్నారు. ప్రస్తుతం ఇందులో యాభైశాతం మందిని మాత్రమే బదిలీ చేయనున్నట్లు సమాచారం. ఇందులో ఏఈ, ఏడీఈ, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, జేఏవోలు సుమారు 150మంది అధికారులకు స్థానచలనం ఉండే అవకాశం ఉంది. వీరితోపాటు జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న జేఎల్ఎం నుంచి ఏడీఈ అధికారుల వరకు మొత్తంగా 500లకుపైగా బదిలీ అయ్యే అవకాశం ఉంది. వరంగల్ సీఎండీ నుంచి నిబం ధనలు రాగానే బదిలీ ప్రక్రియను మొదలు పెట్టానున్నారు. ఈనెల 15 తర్వాత నిబంధనలు వచ్చే అవకాశం ఉన్నట్లు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. విద్యుత్ శాఖలో కొందరు బదిలీల గైడ్‌లైన్స్ కోసం ఎదురుచూస్తున్నారు. విద్యుత్‌శాఖలో యూనియన్ నాయకులకు ప్రొటెక్షన్ లేకుండానే బదిలీల ప్రక్రియ పూర్తిచేయడానికి జాబితాను సిద్ధం చేస్తున్నట్లు విద్యుత్‌శాఖలో చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ఏడీఈ, ఏఈల వివరాలను సీఎండీ కార్యాలయానికి అందజేశారు. ప్రస్తుతం బదిలీల్లో ట్రేడ్ యూనియన్, ఇంజినీరింగ్‌లలోని నాయకులకు మాత్రమే ప్రొటెక్షన్ ఉంది. కానీ జిల్లాలో కంపెనీ పరిధిలో యూనియన్లు ఇష్టారీతిన వెలిశాయి. ప్రొటెక్షన్ కోసం ఉద్యోగ సంఘాలను ఏర్పాటు చేసుకుని బదిలీలలో ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా మిన హాయింపు పొందుతున్నారు. కొందరు హెచ్‌ఆర్ఏ కోసం టౌన్ ప్రాంతంలోనే పనిచేస్తున్నారు. మరికొందరు చాలా రోజులుగా రూరల్ ప్రాంతంలో పనిచేస్తున్నారు. వీరికి టౌన్‌లో పనిచేసే అవకాశం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రొటెక్షన్ పేరుతో ఉద్యోగ సంఘాల నాయకులు టౌన్ ప్రాంతంలోనే పనిచేయడంతో రూరల్ ప్రాంతంలోని ఉద్యోగులకు అన్యాయం జరుగుతుంది. వీరికి తోడు మహిళా ప్రొటెక్షన్ పేరుతో చాలా సంవత్సరాలుగా టౌన్ ప్రాంతంలోనే పని చేస్తున్నారు. దీనిపై వరంగల్ ఉన్న తాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

బోధన్‌లో భారీ వర్షం

- ఈదురు గాలులతో కూడిన వాన
- విరిగి పడ్డ చెట్లు, విద్యుత్ స్తంభాలు
- ఎడపల్లి సంతలో నిలిచిన వరద


● బోధన్‌లో కురుస్తున్న వర్షం


● ఎడపల్లి వారసంతలో ఇలా...

బోధన్‌రూరల్, జూన్ 11: బోధన్ డివిజన్‌లోని పలు మండలాల్లో మంగళవారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో భారీ వర్షం కురియడంతో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. కొన్ని నివాసాల్లో రేకులు సైతం ఎగిరిపడ్డాయి. వర్షం ఒక్కసారిగా కురియడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. చాలా రోజుల తర్వాత వర్షకాలంలో మొదటిసారిగా వర్షం కురియడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేశారు.

ఎడపల్లి: మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే సంతలో కురిసిన వర్షానికి నీరు నిలిచి సంతకు వచ్చిన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూరగాయల దుకాణాల్లో నీరు చేరింది. వర్షంలోనే కూరగాయలు కొనుగోలు చేశారు. పంచాయతీ అధికారులు సంతలో వర్షపు నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలని సంతకు వచ్చిన ప్రజలు కోరుతున్నారు.



ఖరారు కాని పంటల రుణ ప్రణాళిక!

- జిల్లాలో వానాకాలం సాగు ప్రారంభం
- పెట్టుబడి కోసం తిప్పలు పడుతున్న రైతులు
- రుణ ప్రణాళిక కోసం కసరత్తు చేస్తున్న అధికారులు
- వర్షాలు ఆరంభం కాగానే పెద్ద ఎత్తున సాగుకు సిద్ధమవుతున్న రైతులు

నిజామాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని రైతులు పంటల సాగు మొదలు పెట్టినా ఇంకా రుణ ప్రణాళిక మొదలు ఖరారు చేయలేదు. వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడి అందించేందుకు బ్యాంకులు ఇప్పట వరకు రుణ పంపిణీ చేయలేదు. ప్రతి సంవత్సరం మేలోనే రైతులకు రుణాలు ఇచ్చేందుకు వార్షిక రుణ ప్రణాళికను ఖరారు చేస్తారు. వానాకాలం యాసంగిల టార్గెట్‌కు అనుగుణంగా రుణాన్ని పంపిణీ చేస్తారు. అయితే ఈ సంవత్సరం పార్లమెంట్ ఎన్నికలు రావడంతో అధికారులు రుణ ప్రణాళికను పట్టించుకోకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటల ఆధారంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయించడంతో పాటు టార్గెట్‌కు అనుగుణంగా ఆయా గ్రామాల పరిధిలోని బ్యాంకులు రుణాలను అందిస్తారు. ప్రతి సంవత్సరం వానాకాలంలో ఎక్కువ మంది రైతులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటుండగా యాసంగిలో మాత్రం తక్కువగా రుణాలను తీసుకుంటు న్నారు. ప్రతి సంవత్సరం టార్గెట్‌లో 70 నుంచి 80 శాతం వరకు రుణాలను పంపిణీ చేస్తున్నారు. ఈ సంవత్సరం రైతులు సాగు మొదలు పెట్టిన ఇంకా రుణాల పంపిణీ ఆరంభం కాకపోవడంతో ఇతర మార్గాల ద్వారా పెట్టుబడిని సమకూర్చుకుంటూ పంటల సాగును కొనసాగిస్తున్నారు.

బోర్ల కింద పంటల సాగు

జిల్లాలో వర్షాలు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాకున్నా బోర్ల కింద పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో మొక్కజొన్న, పసుపు, సోయా పంటలతో పాటు వరి పంటను సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం జిల్లాలో 5లక్షల 52,128 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వీటిలో 4లక్షల 30,550 ఎకరాల్లో వరిసాగు అవుతుందని అంచనాకు వచ్చారు. మొక్కజొన్న 41,909 ఎకరాల్లో, సోయా 51,428 ఎకరాల్లో సాగు అవుతుందని అంచనాకు వచ్చారు. పసుపు 30వేల వరకు సాగు చేస్తారని అంచనాకు రాగా ఇతర పంటలను కూడా రైతులు వేస్తున్నారు. జిల్లాలో జూన్ ఆరంభం నుంచే పంటలు సాగు మొదలు పెట్టిన రైతులు ఇప్పటి వరకు 10వేల ఎకరాల వరకు పంటలను వేశారు. వీటిలో 3వేల ఎకరాల వరకు వరినాట్లు వేయగా 4వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మరో మూడు వేల ఎకరాల్లో పసుపు పంటను వేశారు. ఈ పంటలే కాకుండా కొద్ది మొత్తంలో సోయా, కందులు, పెసర, పత్తి పంటలను కూడా వేసినట్లు వ్యవసాయ అధికారుల లెక్కలనుబట్టి తెలుస్తుంది. వర్షాలు పూర్తిస్థాయిలో పడగానే భారీ ఎత్తున ఈ పంటలను వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం సన్నరకాలకు బోనస్ క్వింటాలుకు 500 రూపాయలు ఇస్తామని ప్రకటించడంతో జిల్లాలోని మెజార్టీ రైతులు సన్నరకాల సాగుపైనే దృష్టి పెట్టారు. పెద్ద ఎత్తున నారుమల్లను సిద్ధం చేస్తున్నారు. భారీ వర్షాలు పడగానే ఆరుతడి పంటలతో పాటు వరినాట్లను వేసేందుకు సిద్ధమవుతున్నారు.

పెట్టుబడులను సమకూర్చుకుంటున్న రైతులు

జిల్లాలో బోర్ల కింద పంటలను మొదలు పెట్టిన రైతులు పెట్టుబడులను సిద్ధం చేసుకుంటున్నారు. దుక్కులు దున్నడంతో పాటు విత్తనాలకు, ఎరువులకు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. విత్తనాలు వేసేందుకు కూలీలకు కూడా పెద్ద ఎత్తున డబ్బులు అవసరం కావడంతో సన్న, చిన్నకారు రైతులతో పాటు పెద్ద రైతులు పెట్టుబడులను సమకూర్చుకుంటున్నారు. ప్రతి సంవత్సరం వానాకాలం సాగుకు జూన్ ఆరంభం నుంచే పంట రుణాలను పంపిణీ చేసేవారు. గత సంవత్సరం వానాకాలంలో 2437 కోట్ల రూపాయల వార్షిక రుణ లక్ష్యంగా నిర్ణయించారు. సుమారు 1500 కోట్లను రైతులకు పంట రుణాలుగా అందించారు. యాసంగిలోను 1625 కోట్లను లక్ష్యంగా నిర్ణయించారు. రైతులకు 1000 కోట్ల వరకు పంట రుణాలను అందించారు. ఈ సంవత్సరం పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఇప్పటి వరకు రుణప్రణాళికను ఖరారు చేయలేదు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులు వేసే పంటలకు అనుగుణంగా రుణాలు ఇవ్వాలని నిర్ణయించినా ఇప్పటి వరకు బ్యాంకర్ల సమావేశం నిర్వహించలేదు. టార్గెట్‌ను ఖరారు చేయలేదు.

పంట రుణాలపై అధికారుల దృష్టి

ఈనెల 6వ తేదీతో ఎన్నికల కోడ్ ముగియడంతో అధికారులు ఈ పంట రుణాలపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో పంట రుణాల రుణ ప్రణాళికను ఖరారు చేసేందుకు సిద్ధమవుతున్నామని లీడ్ బ్యాంక్ అధికారులు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లోనే సమావేశాన్ని నిర్వహించి రుణ పంపిణీ మొదలు పెడతామని వారు తెలిపారు.

అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు

బోధన్‌రూరల్, జూన్ 11: అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని బోదన్ రూరల్ సీఐ నరేష్ అన్నారు. మంగళవారం సాలూర అంత ర్రాష్ట్ర చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా వాహనాల్లో పశువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

నవీపేట: ఈ నెల 17న జరిగే బక్రీద్ పండుగను పురస్కరించుకుని అక్ర మంగా ఎవరైనా గోవులను తరలిస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దని ఎస్‌ఐ యాదగిరి గౌడ్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం మండ లంలోని యంచలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు.

నేడు ఎన్టీఆర్ అభిమానుల సంబరాలు

బోధన్‌రూరల్, జూన్11: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చం ద్రబాబు నాయుడు బుధవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకా రం చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం మధ్యాహ్నం అం బేద్కర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున ఎన్‌టీఆర్, చంద్రబాబు నాయుడు అభిమా నుల సంఘం ఆధ్వర్యంలో సంబరాలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు అభిమానులు గాంధీ, శివన్నారాయణ, సీహెచ్‌వీ హన్మంత్ రావు తెలి పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్, చంద్రబాబు నాయుడు అభిమానులు, పార్టీ నాయకులు సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలన

రెంజల్, జూన్ 11: మండలంలో చేపట్టిన మిషన్ భగీరథ సర్వేను మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్ దండిగుట్ట, దూపల్లి, కూనేపల్లి గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వా రా అందించిన కుళాయి కనెక్షన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకే మిషన్ భగీరథ ద్వారా ఇం టింటి సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వో గౌస్, పంచాయతీ కార్యదర్శి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్ప కల్యాణోత్సవం

వేల్పూర్, జూన్ 11: వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప కామరాతి ఆలయంలో మంగళశారం భక్తిశ్రద్ధలతో బీరప్ప కల్యాణోత్సవం ప్రారంభించారు. గ్రామ కుర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒన్నాజీ పేట్ గ్రామానికి చెందిన అగ్గు కళాబృందంచే బీరప్ప కామరాతి దేవుళ్ల జన్మవృత్తంతాన్ని నాటిక ద్వారా వివరించారు. అంతకు ముందు కుర్మ సంఘానికి చెందిన కుటుంబాల వారు నైవేద్యాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామప్రజలందరు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని బీరప్ప దేవున్ని వేడుకున్నారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి

బోధన్‌రూరల్, జూన్ 11: ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగిస్తుందని, బస్సుల సంఖ్యను పెంచాలని ప్రగతి శీల మహిళ సంఘం బోధన్ అధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ ఆర్టీసీ డిపోలో వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా మహిళలతో కలిసి డిపో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ బస్సులో మహిళల కు ఉచిత ప్రయాణం సౌకర్యం కొనసాగించడం అభినందనీయమని, కానీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను కూడా పెంచాలని కో రారు. బస్సుల్లో ప్రయాణికులు ఎక్కువ అవ్వడంతో అనేక ఇబ్బందులు ఎదు రవుతున్నాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం మరిన్ని బస్సుల సంఖ్య ను ప్రభుత్వం కొనుగోలు చేసి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడ బ్ల్యూ జిల్లా నాయకురాలు బీపాషా బేగం, గంగామణి, లక్ష్మి, సాయవ్వ, రెహనా బేగం, కళావతి, హైమది, నాగమణి, సమీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

మట్టి శివలింగాల ప్రతిమల తయారీ

బోధన్‌రూరల్, జూన్ 11: బోధన్ పట్టణంలోని నగరేశ్వర వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం మట్టి శివలింగాల ప్రతిమలను తయారు చేయడం ప్రారంభించారు. కార్తీక మాసం సందర్భంగా కాశీలో నిర్వహించే కోటి శివలింగాల అర్చనలో భాగంగా లింగాల తయారీకి మట్టి ని అందజేసి మహిళలు శివలింగాలను తయారు చేస్తున్నారు. దైవ కార్యక్ర మంలో భాగంగా శివలింగాల ప్రతిమలు తయారు చేయడంలో ప్రతి ఒక్క రు భాగస్వాములు కావాలని ఆర్యవైశ్య మహిళలు కోరుతున్నారు. ఈ కార్య క్రమంలో ఆర్యవైశ్య మహిళలు గంజి ధనలక్ష్మి, కొత్త పద్మావతి, కంటాల అనురాధ, చింతల పద్మ, దేవకి, సింధూర, వరలక్ష్మి, రమ, శివలక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన పండిత్, పీఈటీల ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ అర్బన్, జూన్ 11: పదోన్నతులకు సంబంధించి పండిత్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ సీనియారిటీ జాబితా ప్రకారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో లాంగ్వేజ్ పండిత్ తెలుగు, హిందీ, ఉర్దూ, పీఈటీల ధృవ పత్రాల పరిశీలన మంగళవారం ముగిసింది. సీనియారిటీ జాబితా ప్రకారం పండిత్, పీఈటీలు తమ ధృవపత్రాలను విద్యాశాఖ కార్యాలయంలో సరిచూస్తున్నారు. ధృవపత్రాల పరిశీలన ప్రశాంతంగా పూర్తయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలుగా పదోన్నతి పొందనున్న డీఎడ్, డీఎస్సీ-2001, 2002, 2003, ఎస్జీటీ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని సీనియారిటీ జాబితాలోని ఉపాధ్యాయులు మాత్రమే తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ బుక్‌లతో బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మధ్యాహ్నం 2గంటలకు సంబంధిత కౌంటర్లలో వెరిఫికేషన్ చేయించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

పాఠశాలలు ప్రారంభమవుతున్నా పూర్తికాని పనులు



పాఠశాలలో లోపల, వెలుపల నాపరాళ్లు వేయని దృశ్యం

● కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని అధికారులు

డిచ్‌పల్లి, జూన్11:మండలంలో 43 పాఠశాలలకు పాఠశాల మరమ్మతులకు రూ.2కోట్ల 50లక్షల నిధులు మంజూరు కావల్సి ఉండగా కేవలం రూ.25లక్షలు మంజూరు కావడంతో పాఠశాలలు ప్రారంభమవుతున్న ఆదర్శ పాఠశాలలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు మారింది. ఆరుపాఠశాలలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలలో పనులన్నీ ఎక్కడికక్కడే అపరిశుభ్రంగా మిగిలిపోయాయి. పాఠశాలలు ప్రారంభమవుతున్నా విద్యాశాఖాధికారుల లోపం కారణంగా పాఠశాలలో పనులు పూర్తికాక పాఠశాల పునప్రారంభంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో తాగునీరు లేక పాఠశాలలో ఇబ్బందులు పడనున్నారు. వంట గదులు కూడా అపరిశుభ్రంగా ఉన్నాయి. వెంటనే అధికారులు మరమ్మతు పనులు పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గన్‌పూర్ ఉర్దూ మీడియం పాఠశాలలో అసంపూర్తిగా పనులు మిగిలిపోయాయి. గదుల్లో వేయాల్సిన నాపరాళ్లు ఇసుక వేసి చేతులు దులుపుకున్నారు.



రేకులు కొట్టుకుపోయిన వంటగది

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

నాగిరెడ్డిపేట, జూన్ 11 : ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉత్తమమైన విద్యాబోధన అందించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినీలకు యూనిఫాం దుస్తులను, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన తాను ప్రస్తుతం 18 దేశాల్లో బిజినెస్ చేయడానికి ప్రభుత్వ బడి చదువు ఎంతో ఉపయోగపడిందన్నారు. చాలా మంది రాజకీయ ప్రముఖులు ఐఎఎస్‌లు,చ ఐపీఎస్‌లు పాఠశాలల్లోనే చదివి నేడు అత్యుత్తమ పదవుల్లో కొనసాగుతున్నారని ఆయన గుర్తుచేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలలు నేడు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి కోసం 36 కోట్ల రూపాయలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. రెండు మూడు రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు, ఈ రివ్యూ సమావేశంలో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించడానికి అన్ని చర్యలు చేపడతామన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ టేకులపల్లి వినీత, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ సత్యం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్, తాండూరు సొసైటీ ఛైర్మన్ గంగారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు విఠల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఫారూఖ్, ఎంపీడీవో పర్బన్న, ఎంఈవో వెంకటేశం, పాఠశాల ప్రిన్స్‌పాల్ వీణ తదితరులు పాల్గొన్నారు.

మూడులీటర్ల నాటుసారా స్వాధీనం : ఇద్దరి అరెస్టు

సుభాష్‌నగర్, జూన్ 11: నాటుసారాను తయారు చేస్తున్నారన్న పక్కా సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గాంధారి మండలం లొంక తండాలో ఉదయం నుంచి దాడులు నిర్వహించారు. తనిఖీల్లో మూడులీటర్ల నాటుసారాను, తయారీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఇన్‌స్పెక్టర్ స్వప్న తెలిపారు. గాంధారి మండలంలోని లొంక తండాలో ఉదయం దాడులు చేయగానే నాటుసారా తయారు చేస్తున్న కొందరు పారిపోయారని మిగతా ఇండ్లలో తనిఖీలు నిర్వహించగా నాటుసారా దొరికిందని తెలిపారు. నాటు సారా తయారీకి ఉపయోగించే 500 లీటర్ల బెల్లం పాకం, తదితర వస్తువులు దొరికా యని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అసదొద్దీన్‌కు సన్మానం

ఆర్మూర్‌టౌన్ , జూన్11: లోక్ సభ ఎన్నికల్లో గెలుపొందిన ఎంఐఎం అధినేత అసిదుద్దీన్ ఓవైసీని మంగళవారం ఆర్మూర్ పట్టణానికి చెందిన ఎంఐఎం నాయకులు ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని దారుసలాంలో ఆయనను కలిసి పట్టుశాలువ, పూలమాలతో సన్మానించారు. రాబోయే కాలంలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థులు పోటీలో ఉండేలా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు జహీర్, అబ్దుల్ ఖలీల్, ఉబేద్‌దుల్లా, నిజాముద్దీన్, సయ్యద్, మతిన్, సల్మాన్, ఇర్ఫాన్, సుమీర్, తదితరులు పాల్గొన్నారు.

'పీఎం నరేంద్రమోదీ రైతు పక్షపాతి'

ఆర్మూర్‌టౌన్ , జూన్11: మూడవసారి ప్రధాన మంత్రిగా ఎన్నికైన నరేంద్రమోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధిపై తొలి సంతకం చేసి రైతు పక్షపాతిగా నిలిచాడని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షుడు తిరుపతిరెడ్డిలు అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో వారు మాట్లాడుతూ కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రాష్ట్రంలో 33లక్షల రైతులకు రూ.660కోట్లు లబ్ధిచేకూరుతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్ల రైతు సంక్షేమానికే నరేంద్రమోదీ పెద్దపీట వేస్తారని తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో ఎంపీ అర్వింద్‌కు భారీ మెజారిటీ ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

సీఎంను కలిసిన డీసీసీబీ బ్యాంక్ ఛైర్మన్

ఖిల్లా, జూన్ 11: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ కుంట రమేష్‌రెడ్డి మంగళవారం కలిశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని బ్యాంకు కార్యకలాపాలను ఆయనకు వివరించారు. బ్యాంకుకు సంబంధించిన రుణాల పంపిణీతో పాటు ఇతర విషయాలను వివరించడంతో పాటు బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయాలు అందిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు రమేష్‌రెడ్డి తెలిపారు.

దుకాణంలో చోరీ

ఆర్మూర్‌టౌన్ , జూన్11: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో న్యూ ఆగ్రో ఇరిగేషన్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్‌లో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. షాప్‌లో సుమారు రూ.లక్షన్నర విలువ గల కేబుల్ వైర్లు, ఒక టీవీ ఎత్తుకెళ్ళగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు షాప్ యాజమాని తెలిపారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో చోరీ

ఆర్మూర్‌టౌన్ , జూన్11: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గల ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడినట్లు ఆలస్యంగా తెలిసింది. శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు ఆరోగ్య ఉపకేంద్రంలోని ఒక సిలిండర్, ఫ్యాన్, రెండు బీపీ ప్యాడ్‌లు, ఎత్తుకెళ్ళారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఎఎన్‌ఎంలు విధులు నిర్వహించుకొని తిరిగి వచ్చేసరికి మళ్ళీ దొంగలు చోరీకి పాల్పడుతుండడంతో స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించి దొంగలను పట్టించారు. దొంగిలించిన సామాన్‌లను షాప్ దుకాణదారుడికి విక్రయించినట్లు తెలిసింది.

నాట్ విల్లింగ్ ఇచ్చిన వారి పేర్లను తొలగించాలి

నిజామాబాద్ అర్బన్, జూన్ 11: ఉపాధ్యాయ పదోన్నతుల సీనియారిటీ జాబితా నుంచి గతంలో పదోన్నతుల సందర్భంగా రెండుసార్లు నాట్ విల్లింగ్ ఆప్షన్ ఇచ్చిన ఉపాధ్యాయుల పేర్లను తొలగించి తదుపరి అర్హత కలిగిన ఉపాధ్యాయుల పేర్లను పదోన్నతుల జాబితాలో చేర్చాలని టీఎస్ యుటిఎఫ్ నాయకులు మంగళవారం డీఈవో దుర్గాప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సబ్జెక్టుల వారిగా పదోన్నతుల కోసం ఏర్పడిన ఖాళీ సంఖ్యను కూడా విడుదల చేయాలని డీఈవోను కోరారు. డీఈవోను కలిసిన వారిలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యానంద్, కార్యదర్శి ఆనందం, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, భాజన్న తదితరులు ఉన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

రెంజల్,జూన్11: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయారెడ్డి అన్నారు. మంగళవారం దూపల్లి గ్రామంలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని విద్యార్థులకు తల్లి దండ్రులకు సూచించారు. బడిబాట కార్యక్రమం ఈ నెల 19వరకు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలను స్థానిక పాఠశాలలో చేర్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పాఠశాల్లో ఉత్తమ బోధన అందిస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి పిల్లవాడు సద్వినియోగం చేసుకోవాలని తల్లి దండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వెంకట లక్ష్మి, ఉపాధ్యాయులు కృష్ణ, ప్రభాకర్, శ్రీనివాస్, రాధ, లక్ష్మి, దేవమ్మ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటినిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందజేత

గాంధారి, జూన్ 11:గాంధారి మండలంలోని సర్వాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామఅధ్యక్షుడు వెంకట్ కుటుంబానికి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు రూ.4లక్షల ఆర్థిక సహాయం చేశారు.ఈ సందర్భంగా ఆయన ఎన్నికల హామీలో ఇచ్చిన ప్రకారం తన జీతం లోని కేవలం రూ.1 తీసుకుని మిగిలిన జీతాన్ని ప్రజల సంక్షేమానికి వినియోగించనున్నట్లు తెలిపారు.ఇటీవల మరణించిన వెంకట్‌కుటుం బానికి తన రెండునెలల జీతాన్ని అందించానని తెలిపారు.నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధిచేస్తానని మాటలలో కాక చేతలలో చేసి చూపిస్తానని తెలి పారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సౌదీలో గుండెపోటుతో యువకుడి మృతి

రామారెడ్డి, జూన్ 11: రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన షేక్‌యూనస్(45) అనే యువకుడు మృతిచెందాడు. మే 30 న బతుకుదెరువుకోసం సౌదీ వెళ్లాడు. ఆరోగ్య పరిస్థితి బాగలేక ఈనెల 7న గుండెపోటుతో అక్కడే మృతిచెందినట్లు మృతుడి తల్లిదండ్రులు నీజాఒద్దిన్, షైమది తెలిపారు. మంగళవారం మృతిచెందిన సమాచారం అందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. తన కూమారుడు మృతదేహన్ని తీసుకువచ్చేందుకు సహకరించాలని వారు కోరారు.మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చక్కెర ఫ్యాక్టరీలను ప్రభుత్వమే తెరిపించాలి

● అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య

పెద్దబజార్, జూన్ 11: జిల్లాలో మూతబడిన చక్కెర పరిశ్రమలను కొత్త ప్రభుత్వం వెంటనే తెరిపించి నడిపించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని కోటగల్లిలో గల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. గత పాలకుల తప్పుడు విధానాల మూలంగా జిల్లాలో గల ఎన్ఎస్ఎఫ్ బోధన్, ఎన్‌సీ ఎస్ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీలు మూతబడ్డాయని, కొత్త ప్రభుత్వం ఫ్యాక్టరీలను తెరిపిస్తామని రైతులకు ఇచ్చిన హామీ మేరకు సబ్‌కమిటీ వేశారని, ఈ కమిటీల పేరుతో కాల యాపన కాకుండా ప్రభుత్వం వెంటనే తెరిపించి నడిపించాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సరిపడా అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల పంటలకు, దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని రుణమాఫీ వెంటనే అమలు పర్చాలన్నారు. ప్రతి పంట సమయంలో ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని, నేటికీ మద్దతు ధరను ప్రకటించడంలో జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథ్ సిఫారసు మేరకు పంట పెట్టుబడులపై సీ2 + 50 శాతం అదనంగా ధర ఇవ్వాలని ఆయన అన్నారు. సమావేశంలో సంఘం నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు సాయిలు, అగ్గు ఎర్రన్న, దేవన్న, బాబురావు, బన్సి తదితరులు పాల్గొన్నారు.

రూ.500లు అప్పు తీర్చలేదని ఇద్దరిని హత్య చేసిన వ్యక్తికి జీవితఖైదు

నిజామాబాద్ లీగల్, జూన్ 11:ఐదువందలు అప్పు తీర్చలేదని తల్లి, కొడుకుని హత్య చేసిన వరికుప్పల శ్రీనివాస్‌కు మంగళవారం జీవితఖైదు శిక్ష విధిస్తు జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే మామిడిపల్లికి చెందిన వరికుప్పల శ్రీనివాస్ వృత్తి రిత్యా ట్రాక్టర్ డ్రైవర్. అదే కాలనీకి చెందిన అనిల్‌గౌడ్‌కు శ్రీనివాస్ 500ల రూపాయలు అప్పుఇవ్వగా తీసుకున్న అప్పు ఇవ్వమని అనిల్‌గౌడ్‌కు అడగగా తాను ఇవ్వనని కులం పేరుతో దూషించడంతో తనపై కక్షపెంచుకొని 07-11-2021 నాడు శ్రీనివాస్‌గౌడ్ గొడ్డలి తీసుకొని అనిల్‌గౌడ్ ఇంటికి వెళ్లి రాత్రి డబ్బులు ఇవ్వమని గొడవ పెట్టుకొని గొడ్డలితో అనిల్‌గౌడ్‌పై కాలు, తలపై కొట్టగా అడ్డువచ్చిన తల్లిపై కూడా తలపై కొట్టగా తల్లి, కొడుకు అక్కడికక్కడే మరణించారు.

చనిపోయారని నిర్ధారించుకొని అక్కడి నుంచి వెళ్లిపోగా చుట్టుపక్కల వారి సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని ముద్దాయిని కోర్టులో హాజరుపర్చగా పీపీ రవిరాజు తగిన ఆధారాలతో కోర్టులో వాదించగా వివరాలను పరిశీలించిన జడ్జి ముద్దాయి వరికుప్పల శ్రీనివాస్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ అదనంగా 2వేల రూపాయల జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పారు.

'మహిళా అభ్యున్నతే మ్యాక్స్ ధ్యేయం'

డిచ్‌పల్లి, జూన్11: మహిళల అభ్యున్నతి కోసం మ్యాక్స్ మహిళా సంఘాలు ఎంతో చేయూతనందిస్తున్నాయని మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించడం వల్లనే ఈ ఏడాది రూ.7లక్షల ఎనిమిది వేల ఆదాయం సమకూరిందని అధ్యక్షురాలు రాజమణి అన్నారు. మంగళవారం డిచ్‌పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 1546 మ్యాక్స్ సంఘ సభ్యుల్లో సంఘానికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు పాడి పశువుల అభివృద్ధి పథకం, వ్యవసాయ పనిముట్ల కోసం, వ్యాపార నిర్వహణకు సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రతీ సభ్యునికి సంస్థ యొక్క బీమా సదుపాయం చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ సర్వోన్నత్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయాలి

ఆర్మూర్‌టౌన్ , జూన్11: సామ్రాజ్యవాదం, యుదోన్మాదం ప్రపంచ మార్కెట్‌ను కబలించడానికి శాస్త్రీయ దృక్పథంతో సమాజాన్ని అధ్యాయనం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్వేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పీడీఎస్‌యు రాష్ట్ర స్థాయి రాజకీయ విజ్ఞాన తరగతులకు ఆయన పాల్గొని జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, మన కర్తవ్యం అనే అంశాలపై కార్యకర్తలకు బోధించారు. ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలన్ని సామ్రాజ్యవాదుల కుట్రేనని, దేశంలో మోదీ కుట్రపూరిత పాలనకు ప్రజలు చెక్ పెట్టారని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విస్మరిస్తే ఎంతటి వారికైన బుద్ధిచెబుతారని అన్నారు. విప్లవ విద్యార్థులు సామాజ పురోగతికి ఉద్యమించి పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధానకార్యదర్శి నామాల అజాద్, ఎస్.నాగేశ్వర్‌రావు, నరేందర్, అనిల్, పృథ్వీ, అఖిల్, సాయి. సురేష్, గణేష్, ఆనిల్, అశోక్, వెంకటేష్, దీపిక, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై చేయిచేసుకుని పరారైన యువకులు

ఖిల్లా జూన్ 11 : నగరంలోని అరవటౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు పోలీసు సిబ్బందిపై ఇద్దరు యువకులు చేయిచేసుకుని తప్పించుకుని పరారయ్యారు. ఈ ఘటన సోమవారం రాత్రి సారంగపూర్ సమీపంలో గల ఓ హోటల్ వద్ద జరిగింది. డ్యూటీలో ఉన్న పోలీసు సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు యువకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆరవటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో అర్ధరాత్రి సమయంలో ఓ హోటల్‌లో ఇద్దరు యువకులు భోజనం చేశారు. అనంతరం వారు తిన్న భోజనానికి బిల్లుకట్టమని హోటల్ యజమాని వారిని అడ్డుకున్నాడు. దాంతో వారు యజమానికి ఇప్పటి వరకు హోటల్ తెరచి ఉంచావని ఆయనపై దాడికి దిగారు. డయల్ 100కు కాల్ చేయగా పోలీసులు అక్కడికి చేరుకుని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడానికి యత్నించగా వారు పోలీసులపైనే తిరుగబడి వారిని నెట్టివేసి పరారయ్యారు. కేసునమోదు చేసి వారి కోసం గాలిస్తున్నట్లు ఇంచార్జీ ఎస్ఐ మొగలయ్య తెలిపారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో భగీరథ నీటి లీకేజీ

మోస్రా,జూన్11: మండలంలోని చే నెంబర్ తండా(దుబ్బ)గ్రామంలో గల అంగన్‌వాడీ సెంటర్ వద్ద మిషన్ భగీరథ పైపు లీకేజీ అవుతుంది. కొద్దిపాటిగా ఉన్న లీకేజీ రోజురోజుకు పెద్దగా మారడంతో అధిక మొత్తంలో లీకేజీ ద్వారా తాగునీరు వృథాగా పోతోంది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం వద్ద పిల్లలు జారుడుబండ ఆడుకునే వద్ద నీరు ఎక్కువగా నిలిచి ఉండటంతో బురదమయంగా మారింది. అసలే వర్షాకాలం ఆగి ఉన్న మురికి నీరు వల్ల దోమలు విజృంభిస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. లీకేజీతో తాగునీరు సైతం కలుషితం అయితే రోగాలు ప్రబలే ఆస్కారం ఉంది. వెంటనే మరమ్మతులు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. వివరణ కోరగా మిషన్ భగీరథ ఏఈ సాత్విక లీకేజీ స్థలాన్ని పరిశీలించి త్వరగా మరమ్మతులు చేపిస్తామన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై పరిశీలన

నవీపేట : మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం మిషన్ భగీరథ నీటి సరఫరాపై అధికారులు పరిశీలన జరిపారు. గ్రామాలలో మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా, సరఫరా కాని చోట్ల గల కారణాల వంటి వివరాలను సేకరించారు. మంగళవారం నుండి 10రోజుల పాటు గ్రామాలలో ఇంటింటికి తిరిగి ఈ సర్వే చేపట్టడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. పోతంగల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నరేష్‌లు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి : జడ్పీ చైర్మన్



బోర్గం(కె) బడిబాటలో పాల్గొన్న జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్, జూన్11:తల్లిదండ్రులు బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మం గళవారం మండలంలోని బోర్గం(కె) గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి పిల్ల ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం అమ్మఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను అధికారులు పరిశీలిం చారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశిం చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, పాఠశాల సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన విద్యార్థులు



అంకాపూర్‌లో పీఏసీఎస్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

ఆర్మూర్‌రూరల్, జూన్11:మండలంలోని అంకాపూర్ గ్రామాన్ని మంగళ వారం జగిత్యాలలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు సందర్శించారు. అగ్రికల్చర్ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాఠ్యాంశంలో భాగం గా గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, పీఏసీఎస్ కార్యాలయం, రైతుల వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. రైతులు పంటల సాగులో అవలంభిస్తున్న పద్ధ తులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల సాగు, మార్కె టింగ్, ఎర్ర జొన్న, సజ్జ పంటల సాగు తదితర విషయాలను రైతులు కేకే భాజన్న, గంగారెడ్డి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫె సర్‌లు సౌజన్య, ప్రజ్ఞ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 105 మంది గైర్హాజరు

డిచ్‌పల్లి, జూన్11: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం ఉదయం డిగ్రీ ఆరోసెమిస్టర్ రెగ్యులర్, మధ్యాహ్నం ఒకటో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఆడిట్ అండ్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలి పారు. వర్సిటీ పరిధిలో జరిగిన పరీక్ష కేంద్రాలకు 384 మంది విద్యార్థులకు గాను 359 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1092 విద్యార్థులకు గాను 1012 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఈ పరీక్షలకు 105 మంది గైర్హాజరయ్యారని ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు ఉచిత దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న ఎంఈఓ స్వామి

భీమ్‌గల్ రూరల్, జూన్11: భీమ్‌గల్ మండలంలోని బడాభీమ్‌గల్, బాచన్‌పల్లి గ్రామాలలో ఐకెపి సెర్ప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత స్కూల్ యూనిఫాం దుస్తులను ఎంఈఓ స్వామి ఐకెపి ఎపిఎం రవీం దర్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐకెపి ఎపిఎం రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత దుస్తుల తయారీ ఐకెపి సెర్ప్ మహిళా సంఘ సభ్యులద్వారా దుస్తులను కుట్టించి వారికి ఉపాధీ అవకాశాలు ప్రభుత్వం కల్పించిందని అన్నారు. ప్రతి గ్రామంలో ఐకెపి ద్వారా టైలరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సీనియర్ సీసీలు కుంట శ్రీనివాస్, పురస్తు నరేష్, గడాల రఘుపతి, సాయన్న, భాస్కర్ వివోఏ లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబసభ్యులు వేధిస్తున్నారని వ్యక్తి ఆత్మహత్య

ఖిల్లా,జూన్ 11 : తనను భార్య కుటుంబసభ్యులు వేదిస్తున్నారని వారి వేధింపులు తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం తెల్లవారుజామున నగరంలోని ఆరోటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని నసీంకాలనీలో చోటు చేసుకుంది. నసీం కాలనీకి చెందిన మహ్మద్ అన్వర్ (35)కు ఏడునెలల క్రితం భార్యతో గొడవ పడడంతో భార్య డెలీవరి కో సం పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య పుట్టింటికి వెళ్లినప్పటి నుంచి మృతుడు ఒంటరిగా ఇంట్లో ఉంటున్నాడు. తరుచూ తల్లి దండ్రులతో గొడవ పడే వాడు. మానసికంగా వేదనకు గురైన మృతు డు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఇస్మా యిల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆరో టౌన్ ఎస్‌ఐ మొగలయ్య తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

బోధన్‌రూరల్,జూన్11:గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని ప్రముఖ సంఘ సేవకురాలు, గవర్నర్ అవార్డు గ్రహీత సరోజనమ్మ అన్నారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాన్ని ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన భండాగారాలు అని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భూవివాదంలో న్యాయం జరగడం లేదని..

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

- నిజామాబాద్ సీపీ కార్యాలయ ఆవరణలో ఘటన



బాధితురాలు నర్సమ్మ

ఖిల్లా , జూన్ 11 : తన భూమిని కబ్జా చేశారని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని.. వెంటనే తనకు న్యాయం చేయాలని ఓ వృద్ధురాలు నిజామాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయ ఆవరణలో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలి కథనం ప్రకారం.. జిల్లాలోని మాక్లూర్ మండలం దాస్‌నగర్‌కు చెందిన నర్సమ్మకు గ్రామంలో 20గజాల స్థలం ఉం ది. అయితే ఈ స్థలాన్ని కొందరు.. అధికార పార్టీ నేతల అండదండతో కబ్జా పాల్పడుతున్నారని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసింది. న్యాయం చేయాలని పలుమార్లు మాక్లూర్ పోలీసు స్టేషన్‌కు, మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసినా.. ఇప్పటి వరకు తమకు న్యాయం జరగలేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన నర్సమ్మ తనకు న్యాయం చేసి.. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలంటూ నిజామాబాద్‌లో ని పోలీసు కమిషర్ కార్యాలయానికి తన కూతురు గంగలక్ష్మి, మనవడు, మనువరాలి లతో వచ్చింది. కుటుంబీకులతో కలిసి కార్యాలయ సిబ్బందికి తన సమస్యను విన్నవించుకుంది. ఆ తర్వాత కార్యాలయ ఆవరణలోనే తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి.. అపస్మారక స్థితిలోకి వెళ్లింది. విధుల్లో ఉన్న సిబ్బంది గమనించి ఆమెను చికిత్స నిమిత్తం వెంటనే జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వృద్ధురాలి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఇసుక తవ్వకాలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫిర్యాదు

ఖిల్లా, జూన్ 11: కామారెడ్డి జిల్లా పరిధిలోని మంజీరా నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయని కన్‌సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మస్ అసోసియేషన్ తెలంగాణ ప్రెసిడెంట్ కె.సోమశేఖర్‌రావు మంగళవారం ఫిర్యాదు చేశారు. కామారెడ్డి జిల్లా పరిధిలోని బిచ్కుంద, బీర్కూర్ మండలాల పరిధిలో ఈ తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆయనకు వివరించారు. వందలాది లారీల ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా ప్రతిరోజు ఈ ఇసుకను తరలిస్తున్నారని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అనాధికారిక తవ్వకాలతో పాటు ఇష్టం వచ్చిన రీతిలో లారీలను నడపడం వల్ల రోడ్లు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన మంత్రికి వివరించారు. ఈ ఇసుక అక్రమ రవాణాపై పిట్లం, నిజాం సాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు దెబ్బతిని రైతులకు ఇబ్బందులు తలెత్తుతు న్నాయని ఆయన పేర్కొన్నారు.

స్త్రీనిధి నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ చేపడుతున్న ఐకేపీ అధికారులు

బోధన్‌రూరల్,జూన్11: బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో మహిళా స్వయం సమృద్ధి కోసం అందిస్తున్న స్త్రీనిధి నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపణలు రావడంతో మంగళవారం నిధుల దుర్వినియోగంపై అధికారులు విచారణ చేపట్టారు. ఐకేపీ ఆడిట్ రీజినల్ మేనేజర్ రాందాస్, మేనేజర్ వరలక్ష్మిలు స్వయం సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. గ్రూపుల వారిగా నిర్వహించిన ఆడిట్ వివరాలను వివరించారు. వీవోఏ అరుణ రుణాలకు సంబంధించి సొమ్ము దుర్వినియోగానికి పాల్పడినట్లు వెల్లడించారు. స్త్రీనిధికి సంబంధించిన 3లక్షల రూపాయలు రికార్డులలో నమోదు చేయకపోవడం ఆడిట్‌లో వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై వీవోఏకు స్వయం సహాయ సంఘాల మహిళలకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఆడిట్‌లో వెలుగు చూసిన నిధులకు సంబంధించిన రికార్డులను అందజేయాని ఆడిట్ రీజినల్ మేనేజర్ రాందాస్ వీవోఏను ఆదేశించారు. దుర్వినియోగానికి పాల్పడిన 3లక్షలు ఈ నెల 20వ తేదిలోగా వెల్లడించాలన్నారు.ఈ విచారణలో ఏపీఎం గంగారాం, కమ్యూనిటీ కోఆర్డినేటర్‌లు పోశెట్టి, బాలరాజు, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాపై శిక్షణ

రుద్రూరు, జూన్ 11 :రుద్రూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పెద్దల బీసీజీ టీకాపై ఆశలు, ఆరోగ్య కార్యకర్తలకు, సూపర్‌వైజర్లకు స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ అయేషా సిద్దిఖి ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్దల బీసీజీ టీకా కార్యక్రమంలో జిల్లా వయోజన బీసీజీ టీకా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంతోష్‌కుమార్ ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఆశా కార్యకర్తలందరూ 18 సంవత్సరాలు పై బడిన వారి వివరాలు, బీసీజీ టీకాకు అర్హులు, అర్హత లేని వారి వివరాలను సేకరించాలన్నారు. ఈ బీసీజీ టీకా 1978 నుంచి సార్వత్రిక టీకాల కార్యక్రమంలో భాగంగా శిశువులకు 0-1 సంవత్సరం వారికి ఎడమ చేతి భుజంపై ఇవ్వడం జరుగుతుందన్నారు. టీకాను క్షయ వ్యాధి నివారణ కొరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. అయితే ఈ టీబీ పెద్దలలో ఈ వ్యాధి భారం యొక్క ప్రభావాన్ని తగ్గించుటకు ఎంపిక చేయబడిన 18 సంవత్సరాలపై బడిన వ్యక్తులకు వయోజన బీసీజీ టీకా ఇవ్వబడుతుందన్నారు. దీనిపై సర్వే చేయాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కో-ఆర్డినేటర్ రవిగౌడ్, ఎస్‌టీఎల్‌ఎస్ పద్మ, హెచ్‌ఈవో రాజేందర్, సూపర్‌వైజర్లు ఆర్.రవి, సుమతి, సావిత్రి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమి కోసం హత్య చేసిన నిందితుల రిమాండ్

ఇందల్వాయి, జూన్ 11: గత నాలుగు రోజుల క్రితం డిచ్‌పల్లి లోని సీఎంసీ సమీపంలో ఇందల్వాయి మండలం లోని మేగ్యానాయక్ తాండాకు చెందిన లకావత్ వెంగల్‌ను హత్య చేసిన వ్యక్తుల ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. వెంగల్ తన సమీప బంధువు అయిన లకావత్ బిజ్జు, బిజన్‌ల పేరు పైన ధరణిలో కలిగి ఉన్న భూమిని పట్టాపాసుబుక్‌పైన బిజ్జు మామపైన నమోదైనందున అట్టి భూమికి సంబంధించిన రుణమాఫీ, రైతుబంధు డబ్బులు బిజ్జు తీసుకుంటున్నందున ఆయొక్క భూమిని తమ పేరుమీద మార్చాలని గత కొన్ని రోజు లుగా అడుగుతున్నా మార్చకపోవడంతో అతన్ని చంపివేస్తే భూమి తనకే దక్కుతుందని భావించి లకావత్ బిజ్జు, బిజన్, అతని కుమారుడు అనిల్‌లు మేగ్యానాయక్ తాండాకు చెందిన బిక్యానా యక్‌కు సుపారి ఇస్తామని మాట్లాడుకొని బిక్య చేత గత గురువారం రోజు డిచ్‌పల్లి సీఎంసీ ఆసుపత్రి సమీపంలో నిర్మానుశ్య ప్రదేశానికి తీసుకెళ్లి మద్యం తాగిన తర్వాత దారుణంగా హత్య చేయించారు. సీసీ పుటేజీ ద్వారా నింధితున్ని పట్టుకొని విచారించగా వెంగల్‌ను చంపేస్తే సుపారి ఇస్తామని వారు చెప్పడంతో హత్య చేసినట్లు బిక్యనాయక్ ఒప్పుకున్నట్లు తెలిపారు. హత్య చేసిన బిక్యనాయక్‌తో పాటు హత్య చేయించిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిం చామని ఎస్సై మనోజ్ తెలిపారు.

'చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందించాలి'

ఎల్లారెడ్డి, జూన్ 11 :పోచారం చివరి ఆయకట్టు అన్నాసాగర్, రుద్రారం వరకు పంటలకు నీటి పారుదల శాఖ అధికారులు నీళ్ళు అం దించాలని ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి అన్నారు. బి జోన్ పరిధిలో రైతు లకు ఇబ్బందులు కలుగకుండా కాలువలు, పూడికతీసి నీళ్ళు అందించాలని అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మండలపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమా వేశం నిర్వహిం చారు. అనంతరం అధికారులు చివరి సర్వసభ్య సమావేశం కావడంతో ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి, ఎంపీటీ సీలకు అధికారులు సన్మానంచేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నసురుల్లాబాద్, జూన్ 11 : నసురుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామ శివారులో సోమలింగేశ్వర ఆలయ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం తెలుసుకున్న సీఐ సత్యనారాయణ గౌడ్, ఎస్సై లావణ్య, నసురుల్లాబాద్ పోలీసులు మంగళవారం సంఘటన స్థలానికి చేరు కుని మృతదేహాన్ని పరిశీలించారు. సంఘటన స్థలంలో మృతదేహం సగం కాలి పోయి ఉండటంతో పోలీసులు విచారణ చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాల సమాచారం ప్రకారం దుర్కి గ్రామంలో మిస్సింగ్ కేసు నమోదు అయిందని, కాగా దుర్కి గ్రామానికి చెందిన మావురం బలరాంగా మృతుడిగా అనుమా నిస్తున్నారు. మృతదేహాన్ని బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉం దని అన్నారు.

మిషన్ భగీరథ సర్వే నిర్వహించిన ఎంపీడీవో



గన్‌పూర్‌లో మిషన్ భగీరథ సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీవో

డిచ్‌పల్లి, జూన్11: మండలంలోని మిషన్ భగీరథ ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీవో మహేందర్, ఎంపీవో శ్రీనివాస్ గన్‌పూర్ గ్రామంలో నిర్వహించారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందుతున్న వివరాలను ఆయన అడిగితెలుసుకున్నారు. ప్రతీఒక్కరికి మిషన్ భగీరథ రావాలన్నదే సర్వే ఉద్దేశమని, సర్వేకు వచ్చే సిబ్బందికి గ్రామీణ ప్రజలు సహకరించాలని ఎంపీడీవో కోరారు. ఆయన వెంట గన్‌పూర్ కార్యదర్శి సునీల్‌కుమార్ అన్నారు. గన్‌పూర్ గ్రామంలో మిషన్ భగీరథ సర్వేను పంచాయతీ ఈవో కిషన్‌రావు పరిశీలించారు.

'బస్సులను పెంచి ఉచిత ప్రయాణ పథకాన్ని విస్తరించాలి'



ఆర్మూర్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న సభ్యులు

పెర్కిట్, జూన్11: బస్సులను పెంచి ఉచిత బస్ ప్రయాణ పథకాన్ని విస్తరించాలని ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.గోదావరి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్ సౌకర్యం పథకాన్ని విస్తరించడానికి ఆర్డీనరి, ఎక్స్‌ప్రెస్ బస్‌సర్వీస్‌లను పెంచి ఆర్టీసీ సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేస్తూ ఆర్మూర్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఎండి.అనిష్, పీవోడబ్ల్యు ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు వి.సత్తెవ్వ, పి.రమా, జిల్లా నాయకులు డి.నర్సవ్వ, పుష్పలత, గంగాజమున, ఆర్.రమేష్, కె.రాజేశ్వర్, జి.కిషన్, ఆర్.దా మోదర్, బి.కిశోర్, రవి, బాలయ్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా పెరిగిన విద్యుత్ బిల్లుల చెల్లింపులు

సుభాష్‌నగర్, జూన్ 11: టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ పరిధిలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు రోజురోజుకు గణనీయంగా పెరిగాయని టీజీఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. మే నెలలో లక్షా 48,365 గృహ వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా 20కోట్ల 68 లక్షల మొత్తాన్ని చెల్లించారని ప్రతినెలా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు 20 శాతం పెరుగుతున్నాయని అన్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ మొబైల్ యాప్, వెబ్‌సైట్, ఫోన్‌పే, పేటీఎం ద్వారా నెలవారి విద్యుత్ బిల్లుల చెల్లింపులు చేయవచ్చని తెలిపారు. యుఎస్‌ఐ నెంబర్ నమోదు చేసి తొందరగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. ప్రస్తుతం కొత్తగా బిల్లుపైనే క్యూఆర్ కోడ్‌ను ముద్రించడం జరుగుతుందన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా వరంగల్ సర్కిల్ కేంద్రంలో ప్రారంభిస్తున్నారని అన్నారు.

కుక్కల దాడిలో పదిహేను గొర్రెల మృతి

ఏర్గట్ల, జూన్ 11: మండల కేంద్రానికి చెందిన మెరుగు ముత్తెన్న అనే వ్యక్తికి చెందిన గొర్రెల మందపై మంగళవారం కుక్కలు దాడి చేయడంతో పదిహేను గొర్రెలు మృతిచెందగా, పది గొర్రెలు గాయాలపాలయ్యాయి. పశువైద్యాధికారులు పంచనామా నిర్వహించారు. సుమారు రెండు లక్షల ఆస్తినష్టం జరిగినట్లు పశువైద్యాధికారులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఏర్గట్ల, జూన్ 11: మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్య కర్త శివరాత్రి రవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు ఆర్థిక సహాయం కింద మృతుడు కుటుంబానికి 60 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎనుగం దుల రాజాపూర్ణానందం, నాగులపల్లి అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బోనగిరి రమేష్, మాజీసర్పంచ్ భీమనాతి భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

సుభాష్‌నగర్, జూన్ 11: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెంజర్ల నరేష్, అబ్బయ్యలు తెలిపారు. ఆదివారం నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబర్చిన జిల్లా క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పోటీలు హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరుగనున్నాయి. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈరోజు నిజామాబాద్ నుంచి బయలుదేరినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాజ్‌గణేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ ఉద్యోగులను వేధిస్తున్నారు'

పెద్దబజార్, జూన్ 11: అంగన్‌వాడి ఉద్యోగులను అదనపు పనులు అప్పచెబుతూనే తనిఖీల పేరుతో చిన్న చిన్న లోపాలను ఎత్తి చూపుతూ మానసిక క్షోభ కు గురిచేస్తున్నారని అంగన్‌వాడి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రమేష్ బాబు అన్నారు. మంగళవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయం ఎదుట జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులను అప్పచెప్పకూడదని అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను చర్చించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు, ప్రధాన కార్యదర్శి స్వర్ణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, చంద్రకళ, సూర్యకళ, గోదావరి, యమున, తదితరులు పాల్గొన్నారు.

యానంపల్లి శివారులో మృతదేహం లభ్యం

డిచ్‌పల్లి, జూన్ 11: ఇబ్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేశ్‌పల్లి గ్రామానికి చెందిన మున్నూరుకాపు జగదీష్ (46) గత పది రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. యానంపల్లి శివారులో మంగళవారం గొర్రెల కాపారులు అటవీప్రాంతంలో శవాన్ని గుర్తించి స్థానికులకు సమాచారం ఇవ్వగా పోలీసులు విచారణ చేసి కేశ్‌పల్లి వాసు లకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఎస్‌ఐ మహేష్ పోస్టుమార్టం నిమి త్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. జగదీష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మే రకు డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలూర్ విద్యార్థులకు సన్మానం

ఆర్మూర్‌రూరల్, జూన్11: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదోతరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సన్మానం చేశారు. 10జీపీఏ సాధించిన రష్మిత, సాయిమధుర్య, భావన, శరణ్య, సవిత, దేవ నంద్‌లతో పాటు హెచ్‌ఎం నరేందర్‌ను సన్మానించారు. ఆలూర్ పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినం దించారు.



చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.155	రూ.285	రూ. 305



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,000	రూ.66,200	రూ.905

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీఫ్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మనమే (10.20, 10.20)
మంజియా (హిందీ)1.35,
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (4.20)
: సత్యభామ (7.25)

స్క్రీన్-2 : బ్యాడ్ బాయ్స్ (10.30, 4.30, 10.30)
: మనమే (1.15, 7.15)

స్క్రీన్-3 : సత్యభామ (11.25, 10.40)
: భజే వాయు వేగం (2.20)
: మంజియా (హిందీ) (5.10 7.55)

స్క్రీన్-4 : గోల్డ్ నెంబర్ 1 (10.30)
: లవ్‌మౌలీ (4.45, 10.30) : మనమే (7.40)
: రక్షణ (7.40, 10.30) గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (10.45)

ఉషాప్రసాద్ మల్టీఫ్లెక్స్..

స్క్రీన్-1 : మనమే (10.50, 1.45, 4.40, 7.35, 10.30)

స్క్రీన్-2 : రక్షణ (10.25)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (1.30, 7.30)
: సత్యభామ (4.30)

స్క్రీన్-3 : భజే వాయువేగం (10.30)
: లవ్‌మౌలీ (10.40)
: బ్యాడ్ బాయ్స్ (1.45, 7.45)
: రక్షణ (4.30)
: సత్యభామ (10.30)

దేవి : గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : రక్షణ (11.00, 6.00)
వెపన్ (2.00, 9.00)

విజయ్ : మనమే (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్